





"ఏమేవ్... అబ్బాయి పాసయినాడట. రేపు ఇంటికి వస్తున్నాడు." సంతోషంగా కళ్ళు మెరుస్తూ భర్త చెప్పిన కబురు అనసూయమ్మకు వీనుల విందుగా వినబడింది.

అనసూయమ్మకు కాళ్ళు నిలవటం లేదు. పక్కింటి సుబ్బాయమ్మకు, రెడ్డమ్మకూ చెప్పాలి అనుకొంది. గబగబా సుబ్బాయమ్మకి ఈ కబురు చెప్పింది.



"మా అబ్బాయి పెద్దగ సదివినాడమ్మా! రేపు వస్తున్నాడు."



"అవును... ఉన్నవాడు ఒక్కడేగదమ్మా. ఇంజనీరు అయ్యాడుగందా! అనసూయమ్మా అదృష్టవంతురాలవమ్మా. ఉన్న పదెకరాల మాగాణి పోతే పోయింది ఉన్న ఒక్కడూ ఇంజనీరు అయ్యాడు. నీ కట్టాలు గట్టెక్కేయి". తన కొడుకు చదవలేదని, తనకి ఆస్తి ఉంది, అనసూయమ్మకి లేదనే భావం ఆ మాటల్లో ధ్వనించింది.



అనసూయమ్మ ఆనందంగా చూడమ్మా "సుబ్బాయమ్మ వదినా... నా బిడ్డ నన్ను మహారాణిలా చూసుకొంటాడు. ఉద్యోగం ఈడనే చూసుకుంటాడు. ఆస్థి పోతే పోనీ. రేపు ఇంతకి ఇంతా సంపాదిస్తాడు." అక్కడి నుంచి వెళ్ళిపోయింది అనసూయమ్మ.

ఇంటిలో బాబుకి చక్రాలు వండాలి, పాయసం చేయాలి... ఆలోచనలతో ఇంటికి చేరింది.

భర్త కుర్చీలో కూర్చొని చుట్ట తాగుతున్నాడు. అనసూయమ్మ గబగబా వచ్చి మంచి నీళ్ళు ఇచ్చింది.

ఏమేవ్... టీ ఇవ్వమంటే మంచి నీళ్ళు ఇచ్చావు ఇదేంటి?

"అది కాదయ్యా... బాబు వస్తాడు కదా! ఆడు ఉద్యోగం ఎక్కడ చూసుకొంటే మనం కూడా ఆడకిపోదామయ్యా! ఇన్నాళ్లూ ఆస్టల్‌లో ఉండి చప్పిడి తిండి తిన్నాడు. ఈ పాక అమ్ము కొని పోదామయ్యా... ఏటి అంటావు?" ఆత్రుతగా ఎదురుచూసింది అనసూయమ్మ.

ఇంతకీ ఆడిని రానియ్యే. ఎక్కడుంటాడో, మనల్ని రమ్మంటాడో వద్దో... సందేహంగా భర్త అన్న మాటలకి అనసూయమ్మ మనస్సు విలవిలలాడింది.

అలా అనమాకయ్యా. మరే మా తమ్ముడి కూతురుందయ్యా. జొన్నమొక్కలాగా ఎదిగింది. పదోక్లాసు చదివింది. ఆడికిచ్చి కడదామయ్యా!

వడ్డాది లక్ష్మీసుభద్ర

భర్త విసుగ్గా చూసాడు. చూడు అనసూయా! ఆడు పట్నంలో చదివాడు గందా! ఆడి అభిప్రాయం అడుగుదాం. ఆడు ఉద్యోగం అంటాడో, పెళ్ళి అంటాడో చూద్దాం.

నిన్ను అడగడం నాది బుద్ధి తక్కువయ్యా... అంటూ అక్కడ్నుంచి లేచింది.

ఆ రోజు ఇద్దరూ అన్నం సరిగ్గా తినలేదు. ఎలాగో తెల్లవారింది.

రామయ్య మంచం మీద లేచి కూర్చొని ఆలోచిస్తున్నాడు. ఉన్న పదెకరాలూ బాబు చదువుకి ఖర్చు పెట్టినాం. ఇల్లు తాకట్టులో ఉంది. సరయిన గుడ్డలు కూడా లేవు. ఇక ఈడే ఉద్యోగం చేసి అప్పులు తీర్చాలి. ఏం చేస్తాడో అనుకుంటూ నెమ్మదిగా స్నానం ముగించాడు.

ఈ లోపల అబ్బాయి సురేష్ టకటకా బూటులు చప్పుడు చేసుకుంటూ లోపలకి వచ్చాడు. వంట పొయ్యి దగ్గర కట్టెలు పొయ్యిలోకి తోస్తూ పొగకి దగ్గుతున్న తల్లిని చూడగానే పట్నం బాబు సురేష్‌కి కడుపులో దేవినట్లయింది.

“అమ్మా!... కొడుకు పిలుపు వినగానే తల్లి పరుగెత్తుకొచ్చి, తెల్లగా ఉన్నాడు మాసిపోతాడు అన్న భయంతో దూరంగా నిలబడి కళ్ళమ్మట నీళ్ళు కారుతూంటే చేతులు కడుక్కొని వచ్చి మానానే వచ్చినావా. దా... అంటూ నులక మంచం వాల్చి, దుప్పటి వేసి కూర్చోబెట్టింది.

చేతులు పట్టుకొని బాబూ ఇక్కడే ఉద్యోగం చూసుకొంటావా? పాసయినా వంటగ... మా కష్టాలు అన్నీ తీరిపోయినాయి గదా!

“అవునమ్మా ఇక నీవు మహారాణిలాగా ఉండచ్చు. నీకు మంచి ఇల్లు కొనిపెడతాను. ఈ కట్టెల పొయ్యి ఉండదు. గ్యాస్‌స్టవ్ కొని పెడతాను. సిల్కుచీరలు కొనిపెడతాను అవే కట్టుకోవాలి. ఈ మట్టిగాజులొద్దు బంగారు గాజులు కొనిపెడతాను.

“ఏమయ్యా! విన్నావా? నా కొడుకు ఏం మాట్లాడుతున్నాడో” కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి అనసూయమ్మకి.

రామయ్య ఆ మాటలు వింటూ కూర్చొన్నాడు.

తండ్రి దగ్గరకి వెళ్ళి చేతులు పట్టుకొని ఎలా ఉన్నావు నాన్నా అని అడిగాడు.

తండ్రి కళ్ళమ్మట నీళ్ళుకారాయి. “నాయనా ఎలా ఉంటామురా? నీ చదువు కోసం నిన్ను వదిలి ఉన్నాం. చూడాలని ఇన్ని సంవత్సరాలూ ఎదురుచూసాం. ఇప్పుడొచ్చావు”.

సురేష్‌కి కూడా కళ్ళు వెంబడి నీళ్ళు వచ్చాయి. అంతలోనే అమెరికా ప్రయాణం గుర్తుకు వచ్చింది. నెమ్మదిగా తన మనస్సులో మాటలు ఒక్కోటీ తండ్రికి విపులంగా విప్పి చెప్పాడు.


తండ్రికి గుండెలవిసిపోయాయి.

‘ఒరేయి... అన్నీ తెలిసే చేస్తున్నావా? బుద్ధిగా నేను చెప్పిన అమ్మాయిని చేసుకొని ఇండియాలో తగలడు” కోపంగా అని రామయ్య లేచి వెళ్ళిపోయాడు.

“చూడమ్మా నాన్న... మీరిద్దరూ సుఖపడాలని నా ఉద్దేశ్యం. అమెరికాలో ఇంతకన్నా పెద్ద చదువు చదవడానికి సీటు వచ్చింది. అక్కడికే పోతాను” విసుగ్గా అన్న కొడుకు మాటలకు బ్రాన్పడిపోయింది అనసూయమ్మ.

అయ్యా! నన్ను వదిలిపోకురా. ఈడనే ఉద్యోగం చూసుకో అయ్యా” కన్నీళ్లతో అంది తల్లి.

అది కాదమ్మా. నేను అక్కడికి వెళితే నాన్న, నువ్వు సుఖపడతారు. ఇక్కడ అంతా దరిద్రమే. నాలాంటి ఇంజనీర్లు బాగా సంపాదించాలంటే




అమెరికా బెటరు. ఇక్కడ నా ఉద్యోగానికి డబ్బులు ఎక్కువగా ఇవ్వరు.

"ఇక్కడ ఉండి మంచి నీళ్ళు తాగొచ్చు... పరుగెత్తి పాలు తాగే కన్నా. నేను కూలీ చేసుకొని అయినా అప్పులు తీర్చుకుంటా" తండ్రి ఎప్పుడొచ్చాడో కరాఖండిగా చెప్పాడు.

ఎవరో చిన్న కుర్రాడు వచ్చాడు. "పెద్ద నాన్నా... నీ కోసం ఆయన ఎవరో వచ్చాడు. నీతో మాట్లాడాలంట" వచ్చినవాడు వచ్చినట్లే పరుగెత్తిపోయాడు.

రామయ్యకి కొడుకు పట్టుదల తెలుసు. ఏమనలేక వచ్చిన అతను సొరులాగా ఉన్నాడు. అతను చెప్పిన కబురు విని మతిపోయింది రామయ్యకి. వచ్చిన అతను చెప్పింది విని కాగితం మీద సంతకం పెట్టాడు.

వచ్చిన ఆగంతకుతు కొడుకును వెంట తీసుకెళ్ళిపోయాడు.

ఇక్కడ నదులున్నాయి, బంజరుభూమి కావల్సినంత ఉంది, కొండల మీద భూమీ ఉంది. మేధావులందరూ డాక్టర్లు, ఇంజనీర్లూ అయి ఇతర దేశాలకు పోతున్నారు. కన్నతల్లి సంవత్సరం పాలు ఇస్తుంది. ఈ జన్మభూమి ఈ మేధావులను అందరినీ చచ్చేంత వరకూ చూడాల్సిందే కదా! ధనం, అన్నం, వస్త్రాలను ఇచ్చిన మాతృభూమిని కాదనుకొనిపోతున్నారు. వారికి మనస్సు ఎలా ఒప్పిందో. తను లోకం చూశాడు. కొద్దో గొప్పో చదువుకున్నాడు. కాబట్టి కొడుకుని చదివించాడు. వీడు రెక్కలు రాగానే ఎగిరిపోతాడని తనకీ తెలీదు. అసలు విషయం తెలిస్తే ఈ పిచ్చిది తట్టుకోగలదా? రామయ్య ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి.

తల్లి వచ్చింది. ఏంటయ్యా! అలా కూకున్నావు? ఆ పెట్టి ఏంటి? తెరిచి చూసింది అంతా డబ్బు. సూటుకేసు నిండా డబ్బు.

"ఏంటయ్యా. ఇంతడబ్బు... నాకే."

అవునే తీసుకో... నిర్వికారంగా అన్నాడు రామయ్య.

మన బాబుని పదిలక్షలకి అమ్ముకొన్నాం...

"ఏంటయ్యా ఆ మాటలు... సదువుకని అమెరికా వెళ్ళాడు. అంతేకదా!" అనసూయ మాటలకి నివ్వెరపోయాడు రామయ్య.

మళ్ళీ వస్తాడు కంగారు పడకు. ముందు వాడి చదువుకయిన అప్పులు తీర్చు. అనసూయమ్మ వంటింట్లోకి వెళ్ళింది.

ఓసి పిచ్చిదానా... దీనికి ఎలా చెప్పాలో... కొన్నాళ్ళకి అదే తెలుస్తుందిలే" అనుకున్నాడు రామయ్య.

పాక బదులు చిన్న మేడ లేచింది. గొడ్డు, గోద అన్నీ వచ్చాయి. అనసూయమ్మకు మెడ నిండా, చేతికీ బంగారు ఆభరణాలు అమరాయి. కానీ కొడుకు జాడ లేదు... సంవత్సరాలు గడిచిపోతున్నాయి. అప్పులు తీరడం వల్ల అనసూయమ్మకి మనస్థిమితం చిక్కింది. అప్పుడు కొడుకు గురించి ఆమెలో దిగులు బయలుదేరింది.

ఒకరోజు ఉండబట్టలేక భర్తను అడిగింది. "ఏమయ్యా! కొడుకు అమెరికా వెళ్ళి చాలా ఏళ్లు అయింది... ఉత్తరం ముక్క రాసిన పాపానపోలేదు. నిన్ను అడిగితే ఇదిగో ఫోను... అదిగో ఫోనులో కనుక్కుంటానన్నావు?"

భార్య నిలదీయడంతో ఏం చెప్పాలో రామయ్యకు తెలీలేదు.

ఏంటయ్యా! అట్టా చూస్తావు. ఏంటి కత?

రామయ్యకు ఇక చెప్పక తప్పదేమో అనుకొన్నాడు. చెబితే ఏమవుతుందో? చెప్పకపోతే ఊరుకొనేలా లేదు.

"వాడికి తల్లి పట్ల, ఈ భూమి పట్లా ప్రేమా భక్తీ లేదు అనసూయా... వాడు ఇక నుంచి మనకు ఉత్తరం రాయడు. రాసే టైమున్నా, ఫోను చేసే టైమున్నా రెండూ చేయడు. ఇంక మాట్లాడకు."

"పోనీ మనం పోదామయ్యా! బట్టలు సద్దుతాను" హఠాత్తుగా లేచింది అనసూయ.

మనం ఫోను చేయొచ్చుగదా? ఆశ తీరక అడిగింది.

బట్టలు సద్దుకురావడానికి పక్కనున్న పట్నం కాదు... ఫోను మనం చేయాలంటే వేయి అవుతుంది.

నా బంగారు గాజులు ఇస్తానయ్యా. నువ్వు ఎట్లయిన ఫోను చెయ్యి. మనం ఇద్దరం వస్తున్నామని చెప్పు.

ఓసి ఎర్రిదానా పిల్లాడు మామగారు తెచ్చిన కాగితాల మీద సంతకం పెట్టాను గుర్తుందా?

సంతకం పెట్టినావా? ఎందుకయ్యా? ఆతృత కనిపించింది అనసూయమ్మలో.

శాంతంగా కూర్చో... చెబుతా. మనం పిల్లాడి మామ దగ్గర పదిలక్షలు తీసుకొన్నాం. దానికి బదులుగా అతను కొన్ని షరతులు పెట్టాడు.

పిల్లాడు ఆళ్ళమ్మాయిని ప్రేమించాడు. ఆ పిల్లతోటే బ్రతుకుతానంటున్నాడు. అబ్బాయిని మన నుంచి వేరుచేసాడు.

అయితే మనం పిల్లాడిని వదులుకొంటామా?

తప్పదు. వాడికీ మనకీ ఋణం తీరిపోయింది. వాడు ఇక్కడకు వచ్చినా మనం తల్లీ తండ్రీ అయినా చూడకూడదు. ఫోనులు చేయకూడదు. ఉత్తరాలు వ్రాయకూడదు. వాడు దారిలో కనబడినా కన్నెత్తి పలకరించకూడదు. తన ధోరణిలో విరక్తి భావంతో రామయ్య చెప్పుకుంటూపోతున్నాడు.

అనసూయమ్మ కుప్పకూలిపోయింది. మరి లేవలేదు. ●